# ఈ వూరికి ఆవూ రెంతదూరమో...

"అయినట్టేనా, హడావిడంతానూ?" అని పలకరించేను మా ఆవిణ్ణి.

మా పెద్దబ్బాయి పెళ్ళి చేశాం. వియ్యాలవారు ఇక్కడివాళ్ళే. అయినా పెళ్ళి అన్నవరంలో చెయ్యాలని మొక్కు వుందన్నారు. బంధువులూ, స్నేహితులూ బలగమంతా రారు- అని మా ఆవిడ పేచీ పెట్టింది గాని మొక్కు అనేటప్పటికి అన్నవరమే వెళ్ళాం. పిల్ల కావాలి కదా మరి.

నలుగురికీ కోడలు పిల్లని చూపించడానికి ఒకటే మార్గం. రిసెప్షన్ అంటూ ఒకటి ఏర్పాటు చెయ్యడమే.

సాయంకాలం నాలుగు గంటలకి మొదలైన కార్యక్రమం ఎనిమిదిదాకా సాగింది. అంత సేపు మా ఆవిడ, నేనూ ఎదురెదురుగానే వున్నా ఏకాంతంగా లేం.

"మీ రామనాథంగారు రాలేదు చూశారా?" అంది మా ఆవిడ.

"రాకపోతే ఎలా చూస్తాను!" అని రిపార్టీ నాలికమీది కొచ్చింది కాస్తా, మళ్ళా గొంతులోకి దిగమింగుడై పోయింది.

రామనాథం నా క్లాస్మేటు. "ఉద్యోగం చెయ్యడం బుద్ధితక్కువ

పని" అంటూ వ్యాపారంలోకి దిగాడు. తను రిస్కుల్లో మునిగి తేలి, ఇతరుల్ని రిస్కుల్లో పడేసి వృద్ధిలో కొచ్చేడు.

ఏడేళ్ళనుంచి ఈ ఊళ్ళోనే వుంటున్నా అతనింటి కెళ్ళడం పడ లేదు మాకు. ఏదో సినిమాకి వెడితే, అట్నుంచి సిటీబస్సు దొరక్క నడి చొస్తుంటే కార్లో ప్రత్యక్షమై నేను డ్రాప్ చేస్తానని తయారవడం, ఏదో క్రాస్డ్ చెక్కు ఎక్కణ్ణించో వొస్తే అది మార్చుకోడానికి తిప్పలు పడుతున్న సమయంలో బ్యాంకిలో ప్రత్యక్షమై తన పేర్న ట్రాన్స్ఫర్ చేయించుకొని నగదు ఇప్పించెయ్యడం, నెలల తరబడి గ్యాస్ సిలిండర్ రాకపోతే గ్యాస్ కంపెనీ దగ్గిర దెబ్బలాట పెట్టుకొంటున్న సమయంలో అక్కడ తటస్థపడి నిమిషాలమీద గ్యాస్ ఇప్పించెయ్యడం- ఇలాంటి పన్లు చేసి తన గొప్పతనం (పోనీ అభిమానం) ప్రదర్శించి ఎప్పటి కప్పుడు నన్ను చిన్న బుచ్చెయ్యడం రామనాథం లక్షణం అయి కూర్చుంది.

ఈ పదిరోజులూ గొప్ప హడావిళ్ళో పడ్డాం మరి. మా ఇంట్లోనే కాక ఊళ్ళో తెలిసిన వాళ్ళ ఇళ్ళల్లోను, దగ్గిర వూళ్ళల్లో బంధువు లిళ్ళ లోను పెళ్ళిళ్ళు, ఒడుగులూ రోజుకి రెండూ, మూడునూ. ఇంత హడా విడి లోనూ, ఎవరింటికి వెళ్ళకపోతే ఎవరికి కోపం వచ్చి పోతుందో, మా ఇంట్లో పెళ్ళికి రాడం మానేస్తారో అని భయంచేత పద్ధతిగా అన్ని శుభకార్యాలకీ హాజరయ్యాం మా ఆవిడా, నేనూనూ.

ఒట్టి చేతుల్తో వెళితే సరిపోతుందా, అందరికీ ఏవో కానుకలు పట్టుకెళ్ళాలి.

అవి పుస్తకాలు కావు, లేపాక్షి ఎంపోరియంలో బొమ్మలు కావు, కెమెరాలు కావు, అలారం టైంపీసులు కావు, టాయిలెట్ సెట్లు కావు, మిల్కు కుక్కర్లు కావు, టేబిల్ లైట్లు కావు- మొత్తం ఈ పదిరోజుల నుంచీ కానుకలు కొనడానికి ఎనిమిది వందలైంది.

"మా ఇంటికోసారి రండి" అని అతనూ అన్నాడు, నేను అన్నాను.

కాని అతనింట్లో పెళ్ళి జరిగేవరకు నేను వెళ్ళలేకపోయాను. మా ఇంట్లో పెళ్ళికి– పోనీ రిసెప్షనుకి– అతను రాడేం?

ఆరు రోజుల కిందట వాళ్ళమ్మాయి పెళ్ళికి వెళ్ళినపుడు– తొంభై రూపాయలు పోసికొన్నాను. చుట్టూరా వ్యంజనాల కోసం గుంటలు పెట్టిన భోజనపు పళ్ళెం స్టీలుది; అడుగున్నర డయామీటరుది.

ఆ సంగతి గుర్తుచేసుకొంటూ వుండగానే వొచ్చాడు.

* * *

"మనం వాళ్ళమ్మాయి పెళ్ళికి కంచం ఇచ్చామని మన అబ్బాయికి కూడా కంచమే ఇచ్చినట్టున్నాడు" అంది మా ఆవిడ అతను వెళ్ళాక.

"అవును. కొంతమంది రిసెప్షన్‌లో ఎవరెవరు ఏమేమి ఇచ్చినదీ రాసుకుని, మళ్ళా అదే విలువగల వస్తువుల్ని సందర్భం చూసి ఇస్తారుట–" అన్నాను.

ఈ లోపుగా మా ఆవిడ ఆ ప్యాకెట్ విప్పింది.

కంచమే.

స్టీలుదే.

చుట్టూరా గుంటలు పెట్టిందే.

అడుగున్నర డయామీటరుదే.

"ఇదేమిటి, మనం యిచ్చిన పళ్ళెమే మన కిచ్చేశారా?" అన్నాను పట్టుకుంటూ.

అవును. ఆ రోజు తొందరలో, మేం యిచ్చినట్టు పేరు చెక్కించడం అవలేదు మెషీన్‌తో. అంచేత ఎర్రరంగు పెన్సిల్‌తో రాశాను. "మీరిద్దరూ వొక కంచంలో భోంచెయ్యాలని మా కోరిక ఇహ మంచం అంటారా? మీ నాన్నగార్ని అడగండి–" అని.

ఆ అక్షరాలు చెరపకుండా ఆ పళ్ళెం మీద ఇంకా వున్నాయి.

ఈ పద్ధతీ బాగానే వున్నట్టుంది.

(10–6–78)